www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 22 ఆగస్టు 2023
5
ఏలూరు



ప్రజలకు జవాబుదారీగా ఉండాలి : ఎంపిపి

ప్రజాశక్తి - చింతలపూడి

సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఎంపిపి రాంబాబు అన్నారు. మండలంలోని రేచర్ల గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామ సచివాలయ హాజరు, ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు వంటి సంక్షేమ కార్యక్రమాల పని తీరును పర్యవేక్షించినట్లు తెలిపారు. గ్రామంలో శానిటేషన్ పనులు సంతృప్తికరంగా అమలు చేయాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిపి రాంబాబు

ట్యాబ్‌లు ఇచ్చారు.. పర్యవేక్షణ మరిచారు..!

పట్టించుకోని ప్రభుత్వం, బైజూస్ సంస్థ
రెండు జిల్లాల్లో 32 వేలకుపైగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత
ఏడాది గడవక ముందే 30 శాతానికిపైగా ట్యాబ్‌లు మూలకు
ఛార్జింగ్ ఎక్కకపోవడం వంటి పలు సమస్యలతో పక్కకు
యూట్యూబ్, వీడియో గేమ్స్ అప్‌లోడ్‌తో లక్ష్యానికి తూట్లు
ఉపాధ్యాయుల అవస్థలు వర్ణనాతీతం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతికంగా విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ట్యాబ్‌ల విద్య ఏడాది గడవక ముందే అటకెక్కింది. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాబ్‌ల విద్య అగమ్యగోచరంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. గతేడాది డిసెంబర్ 21న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎనిమిదో తరగతి విద్యార్థులందరికీ బైజూస్ సంస్థకు సంబంధించిన ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది. పశ్చిమగోదావరి జిల్లాలో 14,353 మంది విద్యార్థులకు, ఏలూరు జిల్లాలో దాదాపు 18 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించారు. నిబంధనల ప్రకారం ఈ ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి వరకూ వినియోగించుకోవాల్సి ఉంది. ఆయా తరగతులకు సంబంధించిన పాఠాల కంటెంట్‌ను బైజూస్ సంస్థ అందులో ఏర్పాటు చేసింది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా పాఠాలు తప్ప లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సోషల్ పాఠ్యాంశాలకు సంబంధించిన కంటెంట్‌ను దీనిలో పొందుపర్చారు. తొలుత నాలుగైదు నెలలు అంతా సవ్యంగానే సాగింది. విద్యార్థులు ట్యాబ్‌లో ఏయే పాఠాలు వింటున్నారు.. ఏయే పాఠాలు వినడం లేదో పైస్థాయిలో పర్యవేక్షణ ఉండేది. బైజూస్ సంస్థ ఆర్థికంగా దెబ్బతిని మార్కెట్లో చతికలబడటం, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాబ్‌ల విద్య పూర్తిగా పక్కకుపోయింది.



30 శాతం ట్యాబ్‌లు మూలకు
పలు ట్యాబ్‌ల్లో యూట్యూబ్, ఫ్రీ ఫైర్ గేమ్స్

రెండు జిల్లాల్లో విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌లో 30 శాతం వరకూ పని చేయడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా ఛార్జింగ్ నిలబడకపోవడం, లాగిన్ అని అడగడం వంటి సమస్యలు ఉన్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ట్యాబ్ రిపేర్ వస్తే తిరిగి బాగుచేసే వ్యవస్థ లేకుండాపోయింది. చిన్నచిన్న సమస్యలైతే సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు చూస్తున్నారు. మూడేళ్లపాటు ఉపయోగపడాల్సిన ట్యాబ్ నాలుగైదు నెలలకే మూలనపడిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు మళ్లీ పాత పద్ధతిలోనే విద్య అభ్యసించాల్సి వస్తోంది. తరగతిలో కొంతమంది ట్యాబ్ ఉపయోగించడం, మరికొంతమందికి ట్యాబ్‌లు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. కొత్తగా ఎనిమిదో తరగతిలో చేరిన విద్యార్థులకు ట్యాబ్‌లు ఎప్పటిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా బైజూస్ సంస్థ అందించిన ట్యాబ్‌లో పాఠాలకు సంబంధించిన కంటెంట్ తప్ప వేరే ఏవీ ఓపెన్ కావని అప్పట్లో అధికారులు తెలిపారు. అయితే బైజూస్ ట్యాబ్‌ల్లో యూట్యూబ్, గేమ్స్ వంటివి అప్‌లోడ్ చేసుకోవడం ఎలా అనే వీడియోలు యూట్యూబ్‌లో వచ్చేశాయి. దీంతో విద్యార్థులు యూట్యూబ్ వీడియోలు చూసి ట్యాబ్‌ల్లో యూట్యూబ్, ఫ్రీఫైర్ గేమ్స్ వంటివి అప్‌లోడ్ చేసుకోవడంతో అసలుకే మోసం వచ్చిందని ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పైస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలుస్తోంది. పైనుంచి పర్యవేక్షణ చేసే విద్యార్థులు ట్యాబ్‌ను ఏవిధంగా ఉపయోగిస్తున్నారో ఇప్పటికి ప్రభుత్వానికి తెలిసే ఉండేది. పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే ట్యాబ్‌ల విద్య పూర్తిగా గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్భాటంగా ట్యాబ్‌లను పంపిణీ చేసిన ప్రభుత్వం, తర్వాత గాలికి వదిలేయడంతో హైస్కూల్ విద్యకు తీవ్ర విఘాతం ఏర్పడే పరిస్థితి నెలకొంది. బైజూస్ సంస్థకు లాభాలు రావడం తప్ప, విద్యార్థులకు ఉపయోగపడని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం ట్యాబ్‌లకు సంబంధించి సరైన పర్యవేక్షణ ఏర్పాటు చేస్తే లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.



ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

24న మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ

సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు పిలుపునిచ్చారు. చలో విజయవాడ జయప్రదం కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పసల సూర్యారావు మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి, సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఈ నెల 24న చలో విజయవాడ, ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ర్యాలీకి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మానుకొండ జీవరత్నం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.బాలరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, కోశాధికారి వి.రాజు, పెంటయ్య, శ్రీను, రాంబాబు, గున్నే వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న నేతలు, సింగనపూడి దళితులు

మా భూమిని మాకు అప్పగించి న్యాయం చేయండి

సిపిఎం ఆధ్వర్యాన సింగనపూడి దళితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

'మా భూమిని మాకు అప్పగించి న్యాయం చేయండి' అంటూ సిపిఎం ఆధ్వర్యంలో సింగనపూడి దళితులు స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. 'మా భూమి మాకే ఇవ్వాలి' అంటూ దళితులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సింగనపూడి గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలకు 15.59 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇవ్వగా 1925 నుండి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. 1992లో చేపల సాగుకు ప్రభుత్వం అనుమతివ్వగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్ లీజుకు ఇచ్చారన్నారు. కొంతకాలం లీజుకిచ్చి ఆ తర్వాత భూమిలోకి దళితులను రానీయకపోవడంతో 2016 నుండి అధికారుల చుట్టూ దళితులు తిరుగుతున్నా భూసమస్య పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో భూకేసు నడుస్తుండగా తుది తీర్పు ఇచ్చేవరకు భూమిలో ఇరుపక్షాలు వెళ్లకుండా ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆ ఆదేశాలను ధిక్కరించి పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్ దళితులపై దౌర్జన్యం చేసి చేపలు సాగు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఇప్పటికైనా భూసమస్యను పరిష్కరించి దళితుల భూమిని దళితులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. దళితులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం అండగా నిలబడుతుందని ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దళితులపై దౌర్జన్యం చేసిన పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్‌పై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసి తమకు రక్షణ కల్పించాలని కోరారు. భూమిని దళితులకు అప్పగించి జీవన భృతిని కాపాడాలన్నారు. న్యాయం చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగనపూడి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు పకిరి దావీదు, బొడ్డు చింతయ్య, ఉచ్చుల సుధీర్ కుమార్, మురాల ఆదాము, పాముల యెహోషువా, పకిరి ఇస్రాయిల్, పాలడుగుల శాంతాబాయి, పాలడుగుల శైలజ, పులవర్తి కవలమ్మ, జి.కరుణ, అరుణ జ్యోతి పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న భాస్కర్‌రావు

మహిళా సర్పంచులను గౌరవించాలని వినతి

ప్రజాశక్తి - మండవల్లి

మహిళా రిజర్వేషన్ల ద్వారా ఎంపికైన సర్పంచుల స్థానాల్లో భర్తలు పెత్తనం సాగించడం వల్ల ఆశించినంతగా మహిళా సాధికారత సాధ్యపడటం లేదని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మహిళా సర్పంచులను అధికారం వినియోగించుకునేలా చేయాలని కోరుతూ తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు, విస్తరణ అధికారి ఆనందబాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ మహిళా సర్పంచుల స్థానాల్లో మహిళలను కూర్చోనీయకుండా వారి భర్తలు, బంధువులు పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. దీంతో మహిళా సాధికారత ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు మహిళా సర్పంచులను గౌరవించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక మండల అధ్యక్షులు టి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి టి.మార్కురాజు, పొన్నూరు రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవరత్నం

పారిజాతగిరి ప్రసాదంలో నాణ్యతా లోపం

చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల పారిజాతగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో విక్రయించే ప్రసాదం, పులిహోరలో పురుగులు, ఈగలు ఉంటున్నాయని, దీనికి కారకులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ ఆలయానికి వచ్చే యాత్రికులకు అందించే ప్రసాదంలో పురుగులు, ఈగలు ఉంటున్నా పట్టించుకోని అధికారులు, పాలకమండలి సభ్యులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖాధికారులను డిమాండ్ చేశారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ విఫలమవుతున్నారని మండిపడ్డారు. ప్రాంగణంలో పారిశుధ్య లోపం తీవ్రంగా ఉందని తెలిపారు. అన్నదానం నిమిత్తం విరాళాలిస్తున్న దాతల వివరాలు పూర్తిగా వెల్లడించకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో దీనిపై యాత్రికులు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని విమర్శించారు. ఈ వ్యవహారాలపై దేవాదాయ శాఖ దర్యాప్తు జరిపించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎ.ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు, జి.రాంబాబు, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

25న సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు

ఏలూరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సర్ సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 25న శుక్రవారం దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో దెందులూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. సుమారు 30 కంపెనీలతో ఉదయం తొమ్మిది గంటల నుండి జాబ్‌మేళా నిర్వహిస్తామని, సుమారు రెండు వేల మందికి ఉపాధి కల్పించాలనేది లక్ష్యమని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో హాజరుకావాలని కోరారు.

తాగునీటి చెరువులకు నీరు విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని తాగునీటి చెరువులకు నీరు విడుదల చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వర్షాకాలం వచ్చి రెండు నెలలు గడుస్తున్నా రక్షిత మంచినీటి చెరువుల్లో కాలువల ద్వారా నీరు నింపిన దాఖలాలు లేవని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. అడుగంటిన చెరువుల్లో నీరు బురదగా మారి దుర్వాసన వస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీటితోపాటు స్నానాలకు సైతం నీరు కొనాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ప్రధానంగా లంక గ్రామాల్లోని భాస్కరరావుపేట, మూలలంక, పెదలంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు అద్దాని వెంకటేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాసరావు, దొంగ వెంకట సత్యనారాయణ, వీరవల్లి వరలక్ష్మి, గూట్ల జయరాజు, పెరుమాళ్ల సత్యనారాయణ, చిన్నం శ్రీకాంత్, పరసా రాజేష్, బత్తిన రఘు, గద్దె అనిల్‌కుమార్, కట్టా గాంధీ తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న నేతలు

ఇళ్ల స్థలాలు చూపకపోవడం అధికారుల లోపమే

మండల పరిషత్ సమావేశంలో ఎంపిపి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో పలు గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపకపోవడం రెవెన్యూ అధికారుల లోపమని ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కృష్ణకుమారి, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల స్థలాల్లో లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలకు కరెంట్, నీటి సదుపాయం కల్పించాలన్నారు. వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ మాట్లాడుతూ రైతులందరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ ముసునూరులో పశువైద్యులు లేరని, ఆస్పత్రి కూడా శిథిలావస్థలో ఉందని అనా్రను. మండలంలోని పలు గ్రామాల్లో అటవీ పోరంబోకు భూములను ఆక్రమించిన వారికి విద్యుత్ సరఫరా నిలిపివేయాలన్నారు. హౌసింగ్ ఎఇ బి.శివ మాట్లాడూతూ పిఎంజెవై ద్వారా 617 ఇళ్లకుగాను 606 ఇళ్ల నిర్మాణం జరుగుతుందనా్రను. సమావేశంలో వైసిపి మండలాధ్యక్షులు మూల్పురి నాగమల్లేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

రెమ్యూనరేషన్ ఇప్పించాలని యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగర పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తూ 2019 అక్టోబర్, 2022 అక్టోబర్‌ల్లో వివిధ శిక్షణా తరగతులకు హాజరైన సుమారు 220 మంది ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ నేటికీ చెల్లించకపోవడాన్ని యుటిఎఫ్ నగర శాఖాధ్యక్షుడు రాజారావు జొన్నకూటి, ఉపాధ్యక్షుడు సిహెచ్.షణ్ముఖి తీవ్రంగా ఖండించారు. శిక్షణ సమయంలో ఉపాధ్యాయుల వద్ద నుంచి ఎక్విటెన్స్ తీసుకున్నప్పటికీ నగదు నేటికీ అందకపోవడం చాలా దారుణమన్నారు. వారు సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయమై జిల్లా సమగ్ర శిక్ష సిఎంఒ జె.రవీంద్రబాబును కలవగా శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ సంబంధిత కోర్సు డైరెక్టర్లకు చెల్లించామని తెలిపారన్నారు. దీనిపై సోమవారం డిఇఒను కలిసి సమస్యను వివరించామన్నారు. దీనిపై ఆయా శిక్షణ తరగతులకు సంబంధించిన రెమ్యూనరేషన్ ఎప్పుడో విడుదలైందని, జిల్లాలో ఏలూరు నగర పరిధిలోని ఉపాధ్యాయులకు ఎందుకు చెల్లించలేదో విచారించి సొమ్ము ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

నేరాలకు పాల్పడితే సహించబోం

రౌడీషీటర్లకు డిఎస్‌పి శ్రీనివాసులు హెచ్చరిక

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నేరాలకు పాల్పడితే సహించేదిలేదని, కఠినంగా వ్యవహరిస్తామని ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి ఆదేశాలతో నగరంలోని వన్‌టౌన్, టుటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని సుమారు 72 మంది రౌడీషీటర్లతో సోమవారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని డిఎస్‌పి కార్యాలయంలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కో రౌడీషీటర్‌ను పిలిచి వారి వివరాలు ఆరా తీశారు. జీవనోపాధి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, ప్రయివేట్ సెటిల్‌మెంట్లు వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. మంచి ప్రవర్తనతో ఉన్నట్లు రుజువైతే రౌడీషీట్ ఎత్తివేసేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏలూరు వన్‌టౌన్ సిఐ ఎన్.రాజశేఖర్, టూటౌన్ సిఐ పి.చంద్రశేఖర్, త్రీటౌన్ సిఐ కోమాకుల శివాజీ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసులు

కైకరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరంలో సోమవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుతోపాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంతవరకూ అందించిన సంక్షేమ లబ్ధిని వివరాలతో కూడిన పత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు పంతులు వెంకన్నబాబు, నాయకులు పుప్పాల గోపీ, నక్కా శ్రీనివాసరావు, ఉప సర్పంచి మట్టా మురళి, సచివాలయ, వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వాసుబాబు



ధర్నాలో నినదిస్తున్న నేతలు, కూలీలు

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలని వ్యకాస ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో ఉపాధి కూలీలకు ఏడు నెలలుగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, పే స్లిప్‌లు ఇవ్వాలని, ఉపాధి కూలీలపై ఫీల్డ్ అసిస్టెంట్ దౌర్జన్యం అరికట్టాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీల డబ్బు స్వాహా చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్, ఎపిఒలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీ కర్రి వరలక్ష్మిపై ఉపాధి కూలీ దౌర్జన్యంగా వ్యవహరించాడని, తనకు తెలియకుండా ఆఫీస్‌కు వెళ్తే అంతు చూస్తానని బెదిరిస్తూ భయపెట్టాడని తెలిపారు. గతంలో ఎపిఒ ఉపాధి కూలీల సమస్యలపై ఎన్నిసార్లు చెప్పినా పట్టించు కోలేదన్నారు. కూలీలకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు అందుగుల ప్రభాకర్, జానా జగ్గారావు, ఆకుల దుర్గారావు, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

పునర్విచారించాలి : మాలమహానాడు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దళిత మహిళపై దాడి చేసిన కేసును పునర్విచారించాలని కోరుతూ సోమవారం ఏలూరులో బాధితురాలు దళిత మహిళ సత్యవతి రాష్ట్ర మాలమహానాడు నాయకులతో ఆడిషినల్ ఎస్పిని కలిసి స్పందనలో ఫిర్యాదు చేశారు. మండలంలోని పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీకి చెందిన మువ్వ సత్యవతిపై గతంలో అగ్రవర్ణాలకు చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఆకేసులో ఐదురుగు వ్యక్తులు తనపై దాడి చేస్తే కేవలం ఇద్దరు వ్యక్తులపైనే కేసు నమోదు చేశారని, సమగ్ర విచారణ చేసి నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని ఆమె అడిషినల్ ఎస్పిని కోరారు. ఎస్పిని కలిసిన వారిలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు పంతగాని రమేష్, సుదర్శన్ ఉన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన వారికి కృత్రిమ అవయవాలను విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు జిసిహెచ్ ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా జిసిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో వికలాంగుల పునరావాస కేంద్రం ఉండడం చాల అవసరమని, దీని ద్వారా వికలాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ఫిజియో థెరపీ, ఆడియోలజి, స్పీచ్ థెరపీ మొదలైన సేవలను అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వికలాంగుల పునరావాసకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన ప్రచార జాత, బస్సుయాత్ర ఈనెల 23వ తేదీన జంగారెడ్డిగూడెం చేరుకుంటుందని, అక్కడ నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ కార్యాలయంలో బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకొని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలన్నారు. సొంత గనులు కేటాయించాలని, భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మహిళలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలపై జరిగే దాడులను అరికట్టాలని కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నాయకత్వంలో ఆగస్టు 17న విశాఖపట్నంలో బయలుదేరిన బస్సు యాత్ర ఈనెల 23వ తేదీన జంగారెడ్డిగూడెం చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు దొంత కృష్ణ, రైతు సంఘం నాయకులు మాకిల్వోరావు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు తరలిరండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని టిడిపి నేత గంటా శ్రీనివాసరావు తెలిపారు. నాచుగుంట టిడిపి మండల ఎస్సి సెల్ సమావేశం గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేయుచున్న యువగళం పాదయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోకి వస్తున్న సందర్భంగా నారా లోకేష్కి సంఘీభావంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కడియాల రవిశంకర్, ఇమ్మని గంగాధర్, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల సునీత, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మరపట్ల రామ తులసమ్మ, నాచుగుంట ఎంపిటిసి గంటా ఉషారాణి, మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు నేకూరి ఆశీర్వాదం, సీనియర్ నాయకుడు దూలపల్లి సోమరాజు, అద్దంకి వంశీ, మహిళా నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి రూ.10వేలు సాయం

ప్రజాశక్తి - మండవల్లి

కుటుంబాన్ని పోషించే వ్యక్తిని కోల్పోవడం అనేది ఆ కుటుంబానికి తీరనిలోటని సర్పంచి మెండ జాన్సీ తెలిపారు. స్టేషన్ రోడ్‌లో బిసి కాలనీకి చెందిన తాన వీర వెంకటేశ్వరరావు ఇటీవల సహజ మరణం పొందారు. మట్టి ఖర్చుల నిమిత్తం వైఎస్ఆర్ బీమా ద్వారా వచ్చిన రూ.10వేలను సోమవారం ఆమె కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ పెద్ద చనిపోవడం ఆ కుంటుంబానికి తీరని లోటు అని తెలిపారు. అందరూ వైఎస్ఆర్ బీమా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఆగల్లు సత్యనారాయణ, బోయిన సత్యనారాయణ, మెండ సురేష్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి పాల్గొన్నారు.

ప్రారంభించినా తెరుచుకోని మండల ఎఒ, ఎడిఎ కార్యాలయాలు

నూజివీడు రూరల్ : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఎడిఎ, ఎఒ కార్యాలయాలకు రూ.లక్షలు వెచ్చించి నూతన భవనాలు నిర్మించారు. ఇటీవల వీటిని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఇది జరిగి 15 రోజులు దాటినా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మాత్రం ఇంకా మార్కెట్ యార్డ్ ఆవరణలోనే కొనసాగిస్తున్నారు. రైతులు కార్యాలయం మారిందన్న ఉద్దేశంతో ఇక్కడికి వచ్చి, మళ్లీ మార్కెట్ యార్డ్‌కు వెళ్లాలంటే కనీసం నాలుగు, ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆటోలో వచ్చి వెళ్లాలంటే రూ.100, షేరింగ్ ఆటోలో వచ్చినా కనీసం రూ.50 ఖర్చవతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నూజివీడు ఎడిఎ విద్యాసాగర్ మాట్లాడుతూ వారం రోజుల్లో నూతన భవనంలో కార్యకలాపాలను ప్రారంభిస్తామన్నారు. కార్యాలయంలో ఫర్నిచర్ లేకపోవడంతో కొంత ఆలస్యమైందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని, త్వరలో కార్యకలాపాలు ప్రారంభిస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

వ్యాన్‌లో తరలిస్తున్న మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రాకు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 6 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వేర్వేరు రైలు ప్రమాదాల్లో వ్యక్తులు మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పవర్‌పేట రైల్వే గేటు సమీపంలో వ్యక్తిని రైలుబండి ఢీ కొనడంతో మృతిచెందాడు. ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు వెంకటాపురం గాయత్రినగర్‌కు చెందిన కస్తూరి వెంకటకృష్ణ తాపీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏలూరులోనూ, విజయవాడలోనూ తాపీ పనులు చేస్తూ ఉంటాడు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే క్రమంలో రైలు పట్టాలు దాటుతూ ఉండగా గుర్తు తెలియని రైలుబండి ఢీకొనటంతో వెంకటకృష్ణ మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఏలూరు స్పోర్ట్స్ : ఏలూరు రైల్వేస్టేషన్ పరిధిలోని కొయ్యూరు రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందాడని ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు తెలిపారు. సుమారు 40-45 ఏళ్ల వయస్సు ఉంటుందని, గులాబీ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, మృతుడి వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీలో ఉంచామన్నారు. వివరాలకు 95020 97672కు సంప్రదించాలని ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనాల షోరూంలో చోరీ

ఏలూరు స్పోర్ట్స్ : ద్విచక్ర వాహనాల షోరూంలో చోరీ జరిగింది. ఆదివారం షాపు స్లాబ్‌ను పగలకొట్టి మరీ మోటారు సైకిళ్ల చోరీ చేయటంతో జిల్లా ఎస్పి మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు సిసిఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. సిపిఎస్ సిఐ సిహెచ్ మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని, నేరప్రదేశాన్ని తనిఖీ చేశారు. షాపు యాజమాని బండారు ఆంజనేయులు ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపడుతున్నారు. దొంగలు ఎంతో చాకచక్యంగా షాపులోని సీసీటీవీ ఫుటేజుకు సంబంధించి డివిఆర్‌ను అపహరించటం విశేషం. ఈ తనిఖీల్లో చేబ్రోలు ఎస్ఐ స్వామి, సీసీఎస్ ఏలూరు సిబ్బంది ఉన్నారు.

మహిళా సంఘాలకు సున్నా వడ్డీ చెక్కుల పంపిణీ

ముసునూరు, చాట్రాయిలో మహిళా సంఘాలకు చెక్కులు అందజేసిన ఎంఎల్ఎ వెంకటప్రతాప్



ముసునూరులో చెక్‌ను అందజేస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ముసునూరు

అక్కా, చెల్లెమ్మలకు ముఖ్యమంత్రి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికంగా ఆదుకుంటున్నారని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. సోమవారం మండలంలోని ముసునూరు హైస్కూల్‌లో 4వ విడత సున్నా వడ్డీ చెక్కులు పంపిణీ కార్యక్రమం ఎపిఎం కుంటుంబాబు, ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ఎన్నో సంక్షేమపథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని 14,706 మంది మహిళలకు, 1470 గ్రూపులకు రూ.కోటి 98 లక్షల 74 వేల 989లు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి-2 పాముల గంగధరరావు, వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, సర్పంచిలు, ఎంపిటిసిలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని మహిళా సంఘాలకు సున్నావడ్డీ డబ్బుల చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం చాట్రాయిలో చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేక వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొని, మండలంలోని 1,283 సంఘాలకు రూ.కోటి 50 లక్షల 46 వేల 203లు 0 వడ్డీ చెక్కును మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరడ్డి, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, తహశీల్దార్ సిహెచ్.విశ్వనాథరావు, వైసిపి నాయకులు, వైఎస్ఆర్ ఇందిరా క్రాంతిపదం ఎపిఎం టి.శేఖర్ పాల్గొన్నారు.

కోవిడ్ మృతుని కుటుంబానికి రూ.50 వేల సాయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్‌నేషనల్, మెడికల్ ట్రాన్స్‌ఫోర్ట్ డే పురస్కరించుకుని స్మార్ట్ ప్రొఫెషనల్స్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన 108 డ్రైవర్ రాజారావు కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఇండోర్ స్టేడియం నుంచి పాత బస్టాండ్ వరకూ 108, 104, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్, 30 ప్రయివేట్ అంబులెన్స్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. నూతనంగా లయన్స్ క్లబ్‌లో జాయినైన ఎస్‌విఆర్‌కె కాలేజీ కరస్పాండెంట్ మురళికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం నిర్వహించిన లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ బూసి సురేంద్ర, లయన్స్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ చుక్కా అవినాష్ రాజు, రీజియన్ ఛైర్‌పర్సన్ శేషు కుమార్, స్పెషాలిటీ క్లబ్స్ కోఆర్డినేటర్ ఎన్‌వి.సురేష్ కుమార్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రాజు, అరబిందో మెడికల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ జోనల్ మేనేజర్ గణేష్, అంబులెన్స్ యజమానులు, డ్రైవర్స్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్ రెడ్డి కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిజి కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కావలసిన నైపుణ్యాలన్నీ చదివేటప్పుడే సిఐఐఇ, ఇడిసి సెల్ ద్వారా నేర్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కళాశాలలో అనేక కార్యక్రమాలు రూపొందించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ధరణి ఫుడ్ ఇండస్ట్రీ, ధరణి పికెల్స్ ఎక్స్ పోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ పామర్తి తిరుపతిరావు మాట్లాడుతూ పరిశ్రమలు స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలతో కూడిన పథకాలు అందిస్తున్నారని, ముఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ పరిశ్రమల స్థాపనకు చేయూతను అందిస్తున్నారన్నారు. విద్యార్థులు తెలుసుకొని పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పారిశ్రామికవేత్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ, పిజి కళాశాల కరస్పాండెంట్స్ డాక్టర్ కెయస్ విష్ణుమోహన్, కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాకె ఎ.రామరాజు, పిజి కళాశాల డైరెక్టర్ డాక్టర్ విఆర్‌యస్ బాబు, సిఐఐఇ, ఇడిసి కోఆర్డినేటర్ డాక్టర్ తేరరాజేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందిపై కాంట్రాక్టర్ దాడి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థలోని గ్రీన్ సిటీ పరిధిలో చెత్త వెయ్యవద్దన్నందుకు పారిశుధ్య కార్మికులపై కాంట్రాక్టర్ దాడి చేశారు. సోమవారం గ్రీన్ సిటీ పరిధిలోని కృష్ణ కాలవలో కాంట్రాక్టర్ చెత్త టాక్టర్ ద్వారా చెత్త వేస్తుంటే అడ్డుకున్న మున్సిపల్ సిబ్బందిపై కాంట్రాక్టర్ దాడికి తెగబడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సంబంధిత స్థలానికి వచ్చి వివరణ అడగగా చింతలపూడికి సంబంధించిన కాంట్రాక్టర్‌నని.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఆయనపై కూడా మండిపడినట్లు కార్మికులు వాపోతున్నారు. తన పేరు వీర సింహారెడ్డి అంటూ కార్మికులను అసభ్య పదజాలంతో దూషించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. మేయర్, కమిషనర్, హెల్త్ అధికారి ఆదేశాల మేరకు స్వచ్ఛ భారత్‌కై కృషి చేస్తున్న తమపై ఇలాంటి నిందలు ఏంటని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్‌కు కృషి చేయాలని పారిశుధ్య కార్మికులు కోరుతున్నారు. తమపై దాడికి సంబంధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

మానవత సంస్థ ఆవిర్భావ ర్యాలీ

ప్రజాశక్తి - కలిదిండి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సర్పంచి ఎం.మారుతీ ప్రసన్న జెండా ఊపి ప్రారంభించారు. ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కట్టా నాగలక్ష్మి, సర్పంచి సానా మీనా సరస్వతి, కరెస్పాండెంట్ ఎస్‌వి రామారావు, మానవత సంస్థ ఛైర్మన్ పేటేటి వివేకానంద, అధ్యక్ష, కార్యదర్శులు సత్యన్నారాయణ, జగన్, కోశాధికారి చెన్నంశెట్టి కృష్ణ, పూర శ్రీధర్, మారుబోయిన రత్నారావు, నల్లూరి పెద్దిరాజులు, నరసింహారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పరిరక్షించాలి : ఇఫ్టూ



ఏలూరు కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఇఫ్టూ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వాలు వాడుకున్న నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టియు అనుబంధ ఎపి ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవననిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. బిజెపి బోర్డులోని కార్మికుల నిధులను కాజేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిలిపివేసిందని, వాటిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు పరిరక్షణ కోసం భవిష్యత్తులో కార్మికవర్గం మరింత సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నానుద్దేశించి ఇఫ్టూ అనుబంధ ఎపి ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ రంగ, కార్మిక సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కెవి.రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకటరావులు మాట్లాడుతూ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 1996లో కేంద్ర ప్రభుత్వం బిఒసి చట్టం చేసి, బోర్డులు ఏర్పాటుచేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించిందని తెలియజేశారు. ఎపిలో 2009లో ఈ బోర్డు ఏర్పడిందని, 2018 వరకూ సంక్షేమ పథకాలు అమలు జరిగాయని వివరించారు. ఆనాటి టిడిపి ప్రభుత్వం, ఈనాటి జగన్ ప్రభుత్వం బోర్డు నిధులు రూ.కోట్లు పక్కదారి పట్టించారని తీవ్రంగా విమర్శించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును, కార్మికుల సంక్షేమ పథకాలను కొనసాగించాలనీ, కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకపోతే భవిష్యత్తులో దశలవారీగా పోరాడుతామనీ, కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు పి.నాగేశ్వరరావు, ఎండివి.ప్రసాద్, ఇ.గ్రీష్మ కుమార్, ఎం.నాగరాజు, ఎర్రా శ్రీను, కాకర్ల శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ గ్లాసు, ప్లేట్లు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గరుడపక్షి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. సోమవారం దాత నీలి గంగాధరం ఆర్థిక సహకారంతో గరుడపక్షి నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్టీల్‌ప్లేట్లు, గ్లాసులను సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా, నీలం గంగాధరం సమక్షంలో ఉపాధ్యాయురాలు మీరా తున్నిసాకు అందించారు. ఈ సందర్భంగా డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవాధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సమస్యలు, సేవా కార్యక్రమాలపై అంబేద్కర్ భావజాలంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న దాత నీలం గంగాధర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పటాన్ బాజీ, స్థానికులు, చిన్నారులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి ప్లేట్లు అందజేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

వృద్ధుల కుటుంబాలకు కూరగాయల పంపిణీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న సక్రమ ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజంలో ప్రతిఒక్కరూ సేవా గుణం కలిగి వుండాలని భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఛైర్మన్ భూక్యా వేణు గోపాల్ తెలిపారు. మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం గ్రామంలో భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధుల కుటుంబాలకు సోమవారం కూరగాయలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతిఒక్కరికీ తమ ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. సక్రమ ఫౌండేషన్ త్వరలో మహిళలకు ఉచిత కుట్టు మిషను, శిక్షణా కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జరబల చందు భూక్యా కృష్ణ, కుంజ కిరణ్, భూక్యా శ్రీనివాస్, ధరావత్ గోపాలకృష్ణ, పండు, వీరభద్రుడు, భూక్యా సత్తిబాబు, ధరావత్ కిషోర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ టిడిపి మేనిఫెస్టో

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎర్రాయిగూడెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలు గురించి వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మినీ మెనెఫెస్టోను వివరించారు. దీపం పేరుతో ప్రతీ ఇంటికి సంవత్సరానికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తారని తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్‌టిసి బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. చదువుకుని ఉద్యోగంలేని ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగం వచ్చే వరకూ యువగళం పేరుతో నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పన. ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20వేలు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా మంచినీరు, బిసిలకు రక్షణ చట్టం కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, గ్రామ అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షులు కోర్సా వెంకటేశ్వరరావు, బిసి సెల్ మండల అధ్యక్షులు దెయ్యాల కృష్ణమోహన్, మడకం విరాస్వామి, కూరం సత్యనారాయణ, కుంజం వెంకన్నబాబు పాల్గొన్నారు.

పోలవరం : కమ్మరగూడెం గ్రామంలో సోమవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. బొరగం శ్రీనివాసులు ఆదేశానుసారం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మినీ మెనిఫెస్టోలో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు కృష్ణ, పోతుల శ్రీనివాసరావు, నల్లా రాంబాబు, పాదం ప్రసాద్, కొత్తపల్లి సత్యనారాయణ, ఆకుల రాజా, పిల్లి నాగరాజు, కొండే యేసు, తాడేపల్లి మనోజ్, బన్ను, మోహన్ వెంకట్, జల్లేపల్లి శేష వెంకట జితేంద్ర, కమ్మరగూడెం యువత పాల్గొన్నారు.

మహావిశ్వరూప సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తలపెట్టిన చలో హైదరాబాద్ మహా విశ్వరూప సభను జయప్రదం చేయాలని ఉత్తర కోస్తా జిల్లాల కన్వీనర్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు పిలుపునిచ్చారు. చింతలపూడి పట్టణంలో నియోజకవర్గ ఎంఎస్‌పి, ఎంవిఎఫ్, ఎంఆర్‌పిఎస్ సమావేశం ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ జోసెఫ్ తంబి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర కోస్తా జిల్లాల కన్వీనర్ చిన్న సుబ్బారావు మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణ కోసం మాదిగ జాతి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహావిస్వరూప సభకు లక్షలాదిగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు సంపు నక్షత్ర, ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకురాలు చౌటపల్లి విజయ, పోలవరం నియోజకవర్గ కన్వీనర్ లంక జయ బాబు, పోలవరం నియోజకవర్గ మహిళా కన్వీనర్ కొమ్ముకూరి సుగుణ, చింతలపూడి నియోజకవర్గ ఎంఎస్‌పి కన్వీనర్ కొలికి పాము హైమావతి, మహిళ కన్వీనర్ గొల్లపల్లి సౌజన్య, సింగపాము మల్లికా మాదిగ, లింగపాలెం మండలం ఎంఎస్‌పి కన్వీనర్ డోల వెంకటేశ్వరరావు, కామవరపుకోట ఎంఆర్‌పిఎస్ మండల కన్వీనర్ పొద్దుటూరి ఆంజనేయులు, ముడిచెర్ల గ్రామ ఎంఎస్‌పి కన్వీనర్ తాళ్లూరి పెద్ద యేసు, సోదిమల్ల యేసు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశ సేవపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థులు దేశ సేవపై దృష్టి సారించాలని రిటైర్డ్ మేజర్ జనరల్ బివి రావు తెలిపారు. నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం ఆర్మీ రిటైర్డ్ మేజర్ జనరల్, పరం విశిష్ఠ సేవ మెడల్, విశిష్ట సేవ మెడల్ గ్రహీత బొల్లిన వెంకట్రావు ముఖ్యఅతిథిగా విచ్చేసి నేషన్ - సిటిజన్ ఫస్ట్ రెస్పాన్స్‌బిలిటిలి అనే అంశంపై ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశాన్ని అనునిత్యం కాపలా కాస్తున్న నిజమైన దేశ భక్తులు సైనికులని తెలిపారు. ముఖ్య వక్త బీవీ రావు మాట్లాడుతూ ఆర్మీలో పని చేసే సైనికుల జీవితం సవాళ్లతో కూడినదని, అనునిత్యం దేశ అంతర్గత, బహిర్గత విపత్తులను ఎదుర్కొంటూ జీవనం సాగించడం ఒక నూతన ఉత్తేజాన్ని, అనుభూతిని కలిగిస్తుందన్నారు. తన 32 ఏళ్ల సైనిక జీవితంలో ఎన్నో కీలకమైన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించగలిగానని తెలిపారు. అందులో శ్రీలంక ఆపరేషన్, కార్గిల్ ఆపరేషన్‌లో పాకిస్తాన్ తీవ్రవాదులు భారతదేశంలో చొరబడిన సన్నివేశాలను, కౌంటర్ టెర్రరిస్టుల ఆపరేషన్ మొదలైన వాటిలో వారు పాల్గొన్న అంశాలను వీడియోల రూపంలో విద్యార్థులకు చూపించి, వివరించారు. సైన్యంలో చేరాలనుకునే విద్యార్థులు సత్ప్రవర్తన, కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ కొండా రవి, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు ప్రసంగించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - మండవల్లి

ఎరువులు, పురుగుమందుల విక్రయాలలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయశాఖ అధికారిని ఎస్‌కె.జరీనా తెలిపారు. మండలంలోని లింగాలలో ఎరువులు, పురుగుమందుల దుకాణంలో సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డీలర్లకు పలు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని కోరారు. ఎరువుల వివరాలు, నిల్వ రేటు, స్టాక్ బోర్డులో ప్రదర్శించాలని, రైతులకు అందుబాటులో ఉంచాలని ఆమె తెలిపారు. లైసెన్సులను గడువులోపే రెన్యువల్ చేయించుకోవాలని, ఎంఆర్‌పి ధరలకు మాత్రమే అమ్మకాలు చేయాలని సూచించారు. ఎరువులను ఈపాస్ ద్వారానే అమ్మకాలు చేయాలని, నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు నిల్వ చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అనుమతులు ఉన్న పురుగు మందులు మాత్రమే అమ్మకాలు చేయాలని ఆమె తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

వీరేశ్వర స్వామి ఆలయ సందర్శన

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి వివిఎస్ సోమయాజుల దంపతులు సోమవారం సందర్శించారు. పోలవరం తహశీల్దార్ బి.సుమతి వారికి పూలమాలలతో సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ కార్యదర్శి సంగమేశ్వర శర్మ ఆలయ మర్యాదలతో న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికి, ఆలయ సందర్శన చేయించారు. అనంతరం దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది వారికి జ్ఞాపిక ఇచ్చి సత్కరించారు. ఆయన వెంట ఎస్ఐ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంఎల్ఎ

పోలవరం : మండలంలోని గూటాల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ఛైర్మన్ సింహాద్రి ప్రసాద్ తనయుడు వివాహానికి పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు హాజరై వదూవరులను ఆశ్వీరదించారు. వేద మంత్రాల సాక్షిగా ఇద్దరు వ్యక్తులను ఏకం చేసేది వివాహ వ్యవస్థ అని, ఇద్దరూ ఒక్కటై భవిష్యత్తులో అత్యున్నత స్థాయిని చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

నేను ది.18-08-2023వ తేది ఏలూరు సిటీ, ప్రయాణించు చుండగ, మాదేపల్లి రోడ్డు లో జిరాక్సు తీయుంచుకొను సందర్భం లో నాకు హక్కుగా గల ఫ్లాట్ నెం:66, చ.గ. 310 గల స్థలం యొక్క స్థిరాస్తికి సంబంధించిన హైదరబాద్ పెద అంబరుపేట రిజిష్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం:1265/2001 నా వద్ద నుండి జారీపడి పోయినది.దొరికినవారు తెలియజేయగలరు.

ఇట్లు:- గౌరిపర్తి కళ్యాణి
ఫోన్:9000213929.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు

ఒ.యస్.నెం. 47/2019 మరియు
ఐ.ఎ.నెం. 857/2019
ఒ.యస్.నెం.47/2019

బిట్వీన్:
పద్మనాభుని కిరణ్మయి ...వాది
మరియు
మల్లెంపల్లి లక్ష్మి ...ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాది మరియు పై నెంబరు గల పిటీషనులో రెస్పాండెంటు అయిన మల్లెంపల్లి లక్ష్మి, భర్త: గోపాలరావు, బాపిరాజుగూడెం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా వారికి పై నెంబరు గల దావాలో మరియు ఐ.ఎ.నెం.857/2019 పిటీషనులో పై కోర్టులో **ది.01-09-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొన వచ్చును.** లేని ఎడల సదరు దావా మరియు పిటీషనులు ఏకపక్షముగా తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
19-8-23. అశోక నగర్, ఏలూరు.

మహారాజశ్రీ భీమవరం ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 529/2022

Between:
దారపురెడ్డి లక్ష్మీనారాయణ -వాది
AND
దారపురెడ్డి వీరాస్వామి వగైరా -ప్రతివాదులు

2వ ప్రతివాది: దారపురెడ్డి కనకయ్య, తండ్రి: వీరాస్వామి, వయస్సు 52 సం॥లు, హిందు, పురుషుడు, వ్యవసాయం, డోర్ నెం. 2-56, మెయిన్‌రోడ్డు, చినకాపవరం గ్రామం, ఆకివీడు మండలం, పశ్చిమగోదావరి జిల్లా BJCJ Court.

వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట **ది. 28-08-2023 ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేని యెడల మీపై శ్రీ కోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పేపరు ప్రకటన ఇవ్వటమైనది)

కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ
ది.21-08-2023 సెల్: 9849356865